తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గడ్డం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
22 మే 2024
సంపుటి : 01
సంచిక : 354
పేజీలు : 8
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna




# ఇండియా కూటమికి బుద్ధి చెప్పిన ప్రజలు

- ఐదు దశల్లోనే వారి ఓటమి ఖాయం అయ్యింది
- జూన్ 4న ఫలితాలతో మరింత స్పష్టం
- బీహార్ ప్రచారంలో ప్రధాని మోడీ

**తరంగాలు-పాట్నా,**

అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, టుక్డే టుక్డే గ్యాంగ్‌పై జూన్ 4న కీలక నిర్ణయం రాబోతోందని ప్రధాని మోడీ అన్నారు. ఇంతవరకూ జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో 'ఇండి' కూటమి పూర్తిగా ఓటమిపాలైందన్నారు. ఇండియా కూటమి పాపాలతో 21వ శతాబ్దపు భారతదేశం పురోగమించ లేదని, ఆ కారణంగానే ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలకు గట్టి గుణపాఠం చెబుతున్నారని

-మిగతా 2 లో




## నేనే పాపం ఎరగను..మొర్రో

- ఇంట్లో బిర్యానీ చేయడమెలా
- మరో వీడియోతో పలకరించిన నటి హేమ

హైదరాబాద్,
బెంగళూరు శివారు రేవ్ పార్టీలో తాను లేనని బుకాయిస్తూ సోమవారం వీడియో విడుదల చేసన నటి హేమ, తాజాగా మరో వీడియోను విడుదల చేసారు. తాను హైదరాబాద్ ఇంట్లోనే ఉన్నట్లుగా ఓ వీడియోను షేర్ చేశారు. బెంగళూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటి హేమ ఉన్నట్లు వార్తలు రావడంతో ఆమె వెంటనే ఓ వీడియో వదిలి..

-మిగతా 2 లో




# తెలంగాణ రాష్ట్రగీతం సిద్ధం

- అందెశ్రీ రాసిన గీతంలో స్వల్ప మార్పులు
- సంగీత దర్శకుడు కీరవాణి కంపోజ్
- జూన్2న దశాబ్ది ఉత్సవాల్లో ఆవిష్కరణ
- గీతాన్ని విని ఓకే చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి

**తరంగాలు-హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్ర గీతంపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతాన్ని స్వల్ప మార్పులతో స్వరపరిచారు. తెలంగాణ అవతరణ జరిగి పదేళ్లు కావస్తున్నందున పదేళ్ల సంబరాల్లో భాగంగా జూన్ 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో ఈ గీతాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషం

-మిగతా 2 లో



## నిరుద్యోగుల పాలిట శాపంగాకాంగ్రెస్ విధానాలు

- ఉద్యోగాలు లేవు..నిరుద్యోగ భృతి కానరాదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌కు ఓటేయాలి
- ప్రచార సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

**తరంగాలు-నల్లగొండ,**

నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం- వరంగల్ -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఖమ్మం ? నల్లగొండ ? వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు.

-మిగతా 2 లో




## చివరి గింజవరకు కొంటూనే ఉంటాం

- ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం
- వరివేస్తే ఉరి అన్నవారా.. విమర్శించేది
- చివరి గింజవరకు కొంటూనే ఉంటాం
- తడిసిన, మొలకెత్తిన ధాన్యం కూడా సేకరిస్తాం
- సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెట్టాం
- అబద్దాలతో రైతులను ఆందోళనకు గురిచేస్తే ఊరుకోం
- బిఆర్ఎస్, బిజెపిల తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

**తరంగాలు-హైదరాబాద్,**

ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే

-మిగతా 2 లో



## మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

### రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం

హైదరాబాద్,
రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. భారీ ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగింది. గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అయితే మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు, హనుమకొండ,

-మిగతా 2 లో



## వరి ధాన్యానికి 500 బోనస్ అన్నారు

- ఇప్పుడేమో సన్నవడ్లకే అంటున్నారు
- ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**తరంగాలు-హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్రంలో వరికి చెల్లించే బోనస్ అంశం తీవ్ర దుమారం రేపుతోంది. సన్నం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో

-మిగతా 2 లో

# ప్రపంచంతో పోటీ పడేలా పారిశ్రామిక విధానాలు

- కార్మికులకు ఉపయోగపడేలా పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ పాలసీ
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ దిశానిర్దేశం



**తరంగాలు-హైదరాబాద్,**

పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడేలా విధానాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు సంబంధించి మంగళవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను

-మిగతా 2 లో

## ఇండియా కూటమికి బుద్ధి చెప్పిన ప్రజలు

(మొదటి తరువాయి)

అన్నారు. విపక్ష పార్టీల సారథ్యంలోని 'ఇండియా' కూటమిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని 'ఇండి' కూటమి పాపాలు ముందుకు తీసుకువెళ్లలేవని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఆరో విడత ప్రచారంలో భాగంగా బీహార్ లోని ఈస్ట్ చంపరాన్‌లో మంగళవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలు దేశాన్ని 60 ఏళ్ల పాటు ధ్వంసం చేశాయని, మూడు, నాలుగు తరాల జీవితాలను నాశనం చేశాయని మోదీ విమర్శించారు. 60 ఏళ్లలో ఈ వ్యక్తులు భారీ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. స్విస్ అకౌంట్లు తెరిచారు. మీ పిల్లలకు చదువుకునేందుకు స్కూళ్లులేవు. వారి పిల్లలు మాత్రం విదేశాల్లో చదువులు కొనసాగించారు. పేదల కష్టాల పాలయ్యారని అన్నారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై ప్రధానమంత్రి మోదీ పరోక్ష విమర్శలు చేస్తూ, జూన్ 4 తర్వాత మోదీ బెడ్ రెస్ట్ తీసుకుంటారని ఇక్కడ ఒకరు అన్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే దేశంలోని ఏ ఒక్కరూ తమ జీవితంలో బెడ్ రెస్ట్ తీసుకోకూడదని తాను భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. దేశ ప్రజలంతా పూర్తి శక్తిసామర్థ్యాలతో ఉండాలని కోరుకుంటు న్నానని అన్నారు. జంగిల్ రాజ్ వారసుల నుంచి ఇంతకంటే ఏమి ఆశిస్తాం. మోదీని ఆడిపోసుకోవడం మినహా ఈ ఎన్నికల్లో వాళ్లు మాట్లాడేందుకు ఎలాంటి అంశాలు లేవని మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడత పోలింగ్ జూన్ 25న జరుగనుంది.

## మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

(మొదటి తరువాయి)

వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీస్తూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. కాగా ద్రోణి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు సముద్ర మట్టం నుంచి విస్తరించిందని వివరించింది. ఆకాశం మేఘావృతమై ఉండనుందని వాతావరణ శాఖ తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## ప్రపంచంతో పోటీ పడేలా పారిశ్రామిక విధానాలు

(మొదటి తరువాయి)

అధికారులు సీఎంకు వివరించారు. టెక్స్ టైల్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పాలసీ, ఎక్స్ పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తుమన్నామని సీఎంకు వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రపంచ దేశాల్లో ది బెస్ట్ పాలసీలను అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామికాభివృద్ధి రాష్ట్ర ప్రయోజనాలను మెరుగు పరుస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పలువురు పాల్గొన్నారు.

## వరి ధాన్యానికి 500 బోనస్ అన్నారు

(మొదటి తరువాయి)

పక్షాలు దీనిపై విమర్శలకు పదను పెట్టాయి. ఇదే అంశంపై విపక్ష బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మేనిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్యే హరీశ్ రావు గుర్తుచేశారు. ఇప్పుడు మాట మార్చి సన్న వడ్లకు మాత్రమే ఇస్తాననడం సరికాదని గుర్తుచేశారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండుతుంది. అన్నింటికి బోనస్ ఇవ్వాలంటే రూ.6 వేల కోట్ల భారం పడుతుంది. అందుకోసం సన్నం వడ్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని హరీశ్ రావు విమర్శించారు. ఇలా చేస్తే రూ.400 కోట్ల మాత్రమే ఖర్చవుతుందని వివరించారు. యాసంగిలో రైతులు సన్నం వడ్లు పండించరని హరీశ్ రావు గుర్తుచేశారు. పండించని వడ్లకు బోనస్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బోనస్ ఇవ్వకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త కుట్రకు తెరతీసిందని విమర్శించారు. రైతు భరోసా కింద ఎకరాకు ప్రభుత్వం రూ.2500 ఇవ్వాల్సి ఉందన్నారు. వానాకాలానికి సంబంధించి ఎకరానికి 15 వేల రైతు

భరోసాతోపాటు యాసంగి బకాయిలు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. దొడ్డు వడ్లు కొంటారా? కొనరా? కొంటె ఎప్పటి నుంచి కొంటారో చెప్పాలని సూటిగా అడిగారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టమని తేల్చి చెప్పారు. ఇతర పంటల కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం వడ్లు కొనకపోవడం వల్ల రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణ రాష్ట్రగీతం సిద్ధం

(మొదటి తరువాయి)

నిడివిలో ఈ గీతం సిద్ధం అవుతోంది. సినీ సంగీత దర్శకుడు కీరవాణితో ఈ పాటను రేవంత్ ప్రభుత్వం కంపోజింగ్ చేయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న.. ఇంతవరకు రాష్ట్రం గీతం లేకుండా పోయింది. గతంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం గీతంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా తీసుకు రానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర గీతం ఉండాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని అమోదిస్తూ కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఈ గీతాన్ని రచించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కొన్ని మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఆ గీతం రాసిన అందెశ్రీకి కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో భాగంగా అందెశ్రీ ఈ గీతంలో మార్పులు చేసి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం అమోదముద్ర వేసింది. ఆ గీతాన్ని సినీ సంగీత దర్శకుడు కీరవాణితో కంపోజింగ్ చేశారు. జూన్2న రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో.. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంది. ఈ కార్యక్రమానికి సోనియా గాంధీని చీఫ్ గెస్ట్‌గా పిలవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. నిన్న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సోనియాగాంధీ చేతుల మీదుగా తెలంగాణ గీతాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ గీతాన్ని వినిపించారు. ఈ గీతం చాలాబాగుందని రేవంత్ కితాబిచ్చారు. అయిదారు చరణాలతో పూర్తి గీతం ఉంటుంది. ఇందులో ఉన్నటువంటి రెండు చరణాలను మాత్రమే రాష్ట్రం గీతంగా ప్రకటించారు. ఈ రెండు చరణాల్లో తెలంగాణ అవిర్భావం ఎలా జరిగింది, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకొచ్చేలా రాష్ట్ర గీతం ఉండనున్నది. జూన్2న రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక సమావేశాల సమయాల్లో తెలంగాణ గీతాన్ని ఆలపించే అవకాశం ఉంది.

## నిరుద్యోగుల పాలిట శాపంగాకాంగ్రెస్ విధానాలు

(మొదటి తరువాయి)

మరి అరచేతిలో వైంకుఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్‌ఎస్‌కు ఓటెద్దామా..? ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా..? మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా..? అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. జాబ్ క్యాలెండర్ లేదు. మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ అంటున్నాడు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. ఉద్యోగాలు ఇచ్చామని డైలాగులు కొడితే నమ్మేందుకు మనం పిచ్చోళ్లామా..? కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు. మీ తరపున కొట్లాడాలి అంటే మాకు బలమివ్వాలి. కానీ బాకాలు ఊదేవాళ్లకు కాదు అని కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం ఐదు నెలల్లో అన్ని వర్గాలను మోసం చేసింది. ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. బ్రహ్మాండంగా ఉన్న పరిస్థితిని చెడగొట్టుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పుడైనా ఆలోచించి ఓటేయండి.. ఆగం కాకండి. ఎవరి వల్ల లాభం జరుగుతదో ఆలోచించాలి. బ్లాక్ మెయిలర్లు, దందాలు చేసేటోళ్లకు అవకాశం ఇస్తే సమాజానికి తీవ్ర నష్టం. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే గ్రాడ్యుయేట్లు సరైన తీర్పునివ్వాలి. ఈ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డికి ఆశీర్వాదం ఇస్తే ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంటుంది అని కేటీఆర్ అన్నారు.

## నేనే పాపం ఎరగను..మొర్రో

(మొదటి తరువాయి)

దానికి, నాకు ఏం సంబంధం లేదనేలా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే. అయితే బెంగళూరులోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ రేవ్ పార్టీలో హేమ ఉన్నట్లుగా కన్నడ మీడియా కోడై కూస్తోంది. కన్నడ మీడియాకు హేమ ఫొటో లభించిందని, రేవ్ పార్టీలో ఏ డ్రస్‌లో అయితే హేమ ఉందో.. ఆమె నాకేం సంబంధం లేదంటూ పెట్టిన వీడియోలో కూడా సేమ్ డ్రస్‌లోనే ఉండటంతో..ఆమె ఎంతగా బుకాయించా లని చూసినా.. బుక్ అయినట్లే అనేలా ఇప్పటికే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు, ఈ రేవ్ పార్టీలో నటి హేమ ఉన్నట్లుగా బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ కూడా స్పష్టం చేయడంతో.. హేమ అడ్డంగా బుక్కయిందనేలా సోషల్ మీడియా అంతా ఒకటే ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే.. ఈ రేవ్ పార్టీ వ్యవహారాన్ని సైడ్ ట్రాక్ పట్టించేందుకు, కవరింగ్ చేసుకునేందుకు హేమ శతవిధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఒకవైపు హాట్ హాట్‌గా ఈ రేవ్ పార్టీపై చర్చలు నడుస్తుంటే.. నాకేం తెలియదు అన్నట్లుగా తాజాగా ఆమె ఇన్‌స్టాలో రెసిపీ ప్రోగ్రామ్స్ స్టార్ట్ చేసింది. తాజాగా ఆమె తన ఇన్‌స్టా అకౌంట్‌లో బిర్యానీ తయారీ అంటూ ఓ వీడియోని షేర్ చేసింది. ఇందులో బిర్యానీ మేకింగ్‌ని హేమ చేసి చూపిస్తోంది. అయితే నెటిజన్లు మాత్రం కామెంట్స్‌తో ఆమెను ఆడేసుకుంటున్నారు. 'నువ్వు ఎంత కవర్ చేసినా.. బెంగళూర్ వీడియోస్ పక్కా బయటికి వస్తాయ్', 'నిన్న ఏం షో చేశావు.. రేవ్ పార్టీ నుంచి వీడియో కాల్ పెట్టి.. అబ్బో ఆరితేరిపోయావ్.. జీవిస్తున్నావు', 'మేడమ్ మీరు పార్టీలో వేసుకున్న డ్రస్, మీరు పోస్ట్ చేసిన వీడియోలో సేమ్ డ్రస్ మేడమ్.. దొరికిపోయారు. ఇన్ని రోజులు మీరు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టలేదు.. సడెన్‌గా మీరు ఇలా పోస్ట్‌లు పెడితే.. కవరింగ్ కోసం చేస్తున్నారని పోలీసువాళ్లకి తెలిసిపోతుంది మేడమ్..', 'నీ కవరింగ్లు ఇక ఆపులే'.. అంటూ నెటిజన్లు హేమ పోస్ట్‌కు రియాక్ట్ అవుతున్నారు. ప్రస్తుతం ఈ రేవ్ పార్టీ వ్యవహారంపై ఇటు టాలీవుడ్, అటు కన్నడ సినీ, రాజకీయ వర్గాల్లో హాట్‌హాట్‌గా వార్తలు నడుస్తున్నాయి. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర మాట్లాడుతూ.. రేవ్‌పార్టీలో కోట్ల రూపాయల విలువైన కొకైన్, గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీగా మార్చాలని మేము చేసే ప్రయత్నాలన్నీ ఇతర రాష్ట్రాల డ్రగ్స్ పెడ్లర్ల వల్ల ఫెయిల్ అవుతున్నాయి. ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి నుంచి మరిన్ని వివరాలను సేకరించే పనిలో ఉన్నామని తెలిపారు.

## చివరి గింజవరకు కొంటూనే ఉంటాం

(మొదటి తరువాయి)

కావాలని దుష్ప్రచారాలు చేయడం, అబద్దాలు చెప్పడం అలవాటుగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు వడ్లు కొంటామని ఈ సందర్భంగా భట్టి వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ సర్కార్ రైతులను పట్టించుకోలేదని, ప్రచారార్భాటాలు మాత్రం దండిగా చేసిందని విమర్శించారు. వరివేస్తే ఉరి అన్నవారా విమర్శలు చేసేదని మండిపడ్డారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో మొదలు పెడతామని చెప్పారు. రైతుల పేరు మీద రాజకీయాలు చేయొద్దని ఆ రెండు పార్టీల నేతలకు ఆయన సూచించారు. స్వార్థ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని ఆగ్రహించారు. గత సర్కార్ తడిసిన వడ్లను కొనలేదని విమర్శించారు. తాము తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ రేటుకే కొంటున్నామని తెలిపారు. 15 రోజుల ముందు నుంచి వడ్లు కొనుగోలు పక్రియ ప్రారంభించామని చెప్పారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం బీఆర్‌ఎస్ బీజేపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడొద్దని సూచించారు. గత బిఆర్‌ఎస్ మోసం చేసిన మాదిరిగా కాకుండా...వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే రాజకీయాలు చేయడం అలవాటు కనుక ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడం భారాస నేతలకు అలవాటన్నారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొంటున్నట్లు వివరించారు. గతం కంటే ఎక్కువగా 7,215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కొనలేదని గుర్తు చేశారు. 'చివరి గింజ వరకూ కొంటాం.. రైతులు ఆందోళన చెందవద్దని భట్టి భరోసా ఇచ్చారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా ఎంఎస్‌పీ ఇచ్చి తీసుకుంటాం. ధాన్యం రైతులకు మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నాం. వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలి. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.500 బోనస్ అనేది సన్న ధాన్యం నుంచి మొదలుపెట్టాం' అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో వరి కొనుగోళ్ల విషయంలో రైతులు) ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం తడిసినా, చివరకు మొలకెత్తిన గింజలు కూడా కొంటామని వెల్లడించారు. రేటు తగ్గించకుండా కొంటామని అన్నారు. దీంతోపాటు వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదు, కల్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దవుతుందని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అందులో నిజం లేదని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారని భట్టి గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం కంటే 15 రోజులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ మాదిరిగా కాకుండా మీకంటే ఎక్కువ కేంద్రాల్లో 7,245 కొనుగోళ్లను ప్రారంభినట్లు స్పష్టం చేశారు. ఎన్ని టన్నుల ధాన్యం పండినా కూడా కొంటామని స్పష్టం చేశారు. ఇక ధాన్యం బోనస్ విషయానికి వస్తే సన్న బియ్యానికే రూ. 500 బోనస్ అనలేదని, సన్నాలతో 500 రూపాయల బోనస్ పక్రియను మొదలు పెట్టామని చెప్పారు. నాటి సీఎం కేసీఆర్ వరి వేస్తే ఊరే అని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గుర్తు చేశారు

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 306వ రోజు అన్నదానం



**తరంగాలు ప్రతినిధి/వరంగల్**
యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో గిర్మాజీపేట , వరంగల్ జిల్లాకు చెందిన ఐలోని అరుణ – రాజు కుమర్ దంపతుల 27వ పెళ్లి రోజు సందర్భంగా ఐలోని అరుణ – రాజు కుమార్ సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండలో ఉన్న వృద్ధులకు 306వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐలోని అరుణ – రాజు కుమార్ , హిమవంశీ , అఖిల , నవీన్ , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వీ , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెళ్ళి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలి

**–జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాకాధికారి డాక్టర్ కళావతి బాయి**





**తరంగాలు /మహబూబాబాద్,**
వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి బాయి అన్నారు. మహబూబాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంబేద్కర్ నగర్ నందు గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (ఉపకేంద్రము)ను సందర్శించి మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో సి సెక్షన్ కాన్పులు ఎక్కువగా అవుతున్నట్లు గుర్తించి సి సెక్షన్ కాన్పులను తగ్గించుటకై వైద్య ఆరోగ్య సిబ్బంది, తల్లుల సమావేశంలో గర్భిణీ స్త్రీలకు మరియు వారి బంధువులకు సాధారణ ప్రసవాల వలన చేకూరే ప్రయోజనాలను సిబ్బంది వివరించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్ర పరిధిలోని క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు, అంబేద్కర్ నగర ప్రజలు కేంద్రమునకు సరియైన భవనం లేక ఇరుకు గదలలో నిర్వహిస్తున్నారని దానికి ఒక ఉప కేంద్ర భవనమును నిర్మిస్తే ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, ఆవేదన వ్యక్తం చేస్తూ భవన నిర్మాణము కొరకు స్థలం కేటాయించాలని అడుగగా, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి సమాధానం ఇస్తూ ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి, మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ దృష్టికి మరియు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ఉపకేంద్ర భవనమునకు స్థలం కేటాయించేటట్లు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అంబేద్కర్ నగర పరిధిలోని ప్రజలు రోజువారి కూలీ చేస్తూ జీవనాధారం పొందుతున్నారని మహబూబాబాద్ జిల్లా లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు అన్ని రకాల ప్రత్యేకమైన వైద్యులు అందుబాటులో ఉన్నారని ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, ప్రైవేటు ఆసుపత్రుల మీద ఆధారపడకూడదని ఆమె అన్నారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాక కార్యలయం లో ఆశా నోడల్ పర్సన్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాకాధికారి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో అగ్ర బాగాన వుంచాలని, మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా చూడాలని, ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న గర్భస్రావాల పైన నిఘా ఉంచాలని, ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించి, సాదారణ ప్రసవాల పైన ప్రజలలోమరియు గర్భిణీ స్త్రీల కు అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ బిందుశ్రీ, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి కొప్పుప్రసాద్, డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఎన్హెచ్ఎం డిపిఎంఓ రుక్మొద్దీన్, ఆశా నోడల్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి కాంగ్రెస్ మార్క్ మోసం!


**–మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు...**

**తరంగాలు/తొర్రూరు**
మహబూబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మోసపూరిత మాటలతో రైతులను ఆగం చేస్తూ పరిపాలన చేతకాక కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విరుచుకుపడ్డారు. రైతులు ఎంతైనా వడ్లు పండించుకోండి 500 రూపాయలు బోనస్ ఇచ్చి కొనే బాధ్యత నాది అని సరిగ్గా నెల రోజుల క్రితం ఏప్రిల్ 21న నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాడు కానీ సోమవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్ తర్వాత సన్న వడ్లు పండించిన వారికి మాత్రమే రూ. 500 బోనస్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటనతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగ మారిందన్నారు.తెలంగాణలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు మాత్రమే సాగు చేస్తారు. కేవలం 10 శాతం మంది రైతులు మాత్రం వారి కుటుంబ అవసరాల కోసం మిగిలింది అమ్ముకునే వారు ఉన్నారు.అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణలో అధిక శాతం దొడ్డు వండ్లే పండుతాయి దొడ్డు వడ్లకు మద్దతు ధర ఇవ్వాలని నేడు అధికారం లోకి రాగానే కేవలం సన్నవడ్లకు మాత్రమే మద్దతు ధర ఇస్తామని అనడం వారి బోగస్ మాటలకు నిదర్శనం అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా కాలేశ్వరం ప్రాజెక్టు మీద పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలతో అధికారంలోకి రాగానే నిపుణుల పర్యవేక్షణలో రిపేరు చేస్తున్నామని ఇప్పుడు అనడం వారి మోసపూరిత మాటలకు ఉదాహరణ అని అన్నారు.సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నించే గొంతుక నేను అని మాయమాటలు చెప్పి బ్లాక్మెయిల్ దందాలకు తెరలేపి డబ్బులు వసూలు చేసిన తీన్మార్ మల్లన్న ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తమ యొక్క విలువైన ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పలు లంగ, బద్మాష్ కథలలో 56 కేసులను ఏసుకేసుకున్న ఒక క్రిమినల్ తీన్మార్ మల్లన్న మన పట్టభద్రుల ఎమ్మెల్సీగా అర్హుడా..? అని ప్రశ్నించారు.ఉన్నత విద్యావంతుడిగా సమాజ సేవకై రాజకీయాల్లోకి వచ్చిన ఒక విజనరీ నాయకుడు రాకేష్ రెడ్డి మన పట్టభద్రుల ఎమ్మెల్సీగా అర్హుడా...? ఆలోచించి...మరో నలుగురితో చర్చించి భారత రాష్ట్ర సమితి నిలబెట్టిన ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి మన పక్షాన చట్ట సభకు పంపుదామని పిలుపునిచ్చారు.



## మే.24 న జరుగనున్న పాలీసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి..

**– ప్రిన్సిపాల్ డి. శోభారాణి**



**తరంగాలు/ మహబూబాబాద్**
ఈ నెల 24న జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు (పాలిసెట్ ) – 2024 అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డి.శోభారాణి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. 24 న ఉదయం 11 గంటల నుంచి మాధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చినాఅనుమతించేది లేదని తెలిపారు. పరీక్షకువచ్చేవారు హాల్ టికెట్, pencil, ball point pen తీసుకొని రావాలని తెలిపారు. హాల్ టికెట్ ని polycet.sbtet.telangana. gov.in website నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి SBTET SERVICES app% □,□ %Polycet exam center locator ని ఉపయోగించుకోగలరని తెలిపారు. పట్టణంలోని ఆర్.టి.సి. బస్టాండ్ ప్రక్కన గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, తక్షశిల హై స్కూల్, పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్, శ్రీ చైతన్య ఈ టెక్నో స్కూల్, ఆర్.అండ్ బి. గెస్ట్ హౌస్ పక్కన గల గవర్నమెంట్ హై స్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని గవర్నమెంట్ బాలికల జూనియర్ కళాశాలలో మొత్తం (6) సెంటర్లలో 1,609 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, విద్యార్థులు పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను( smart watch, cellphone, calculator ) తీసుకురాకూడదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**తరంగాలు-వనపర్తి**
దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని కాంగ్రెస్ నాయకుడు చుక్క రాజు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మేఘా రెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్ తో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం హర్షణీయం

**–సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మోకుదెబ్బ నాయకులు ...**



**తరంగాలు ప్రతినిధి/ వరంగల్**
జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లాగా పేరు మారుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ది రాములుగౌడ్ లు మాట్లాడుతూ జనగామ జిల్లాలో పుట్టిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భారత దేశ మొట్ట మొదటి దళిత బహుజన విప్లవ వీరుడు అన్నారు.గౌడ కులంలో పుట్టి దాదాపు 20 కొటలను నిర్మించి మొగలు పాలకులను గడగడలాడించి గోల్కొండ కోటను జయించి పాలించిన మహారాజు పాపన్న అన్నారు. గత 30 సం.రాలు గా మోకుదెబ్బ ఆధ్వర్యంలో జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణ కోసం పోరాడమని ఈరోజు ఆ కలను తెలంగాణ ముఖ్యమంత్రి ఇనుముల రేవంత్ రెడ్డి మాకుల ఆత్మ గౌరవాన్ని గుర్తుంచి పాపన్న జనగామ జిల్లాగా పెట్టడాన్ని స్వాగతిస్తూ సంతోషంగా ఉందన్నారు.మా ఉద్యమాలను గుర్తించి జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టడం అంటే ఇది బడుగు బలహీన వర్గాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఈ ప్రభుత్వనికి బడుగు బలహీన వర్గాలు ఎంతో ఋణ పడి ఉన్నాయి అన్నీ బహుజన కులాల తరుపున మా గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ తరుపున తెలంగాణ ప్రభుత్వనికి రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియాజేస్తున్నాం అని జాతీయ అధ్యక్షులు తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ది రాములు గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి హైకోర్టు న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యం నర్సింలు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోశాల వెంకన్న గౌడ్, రాష్ట్ర నాయకులు తాళ్ళ శ్రీనివాస్ గౌడ్, కొండగొని రవి గౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలు



**తరంగాలు /సంగెం**

సంగెం మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ ఈ సందర్భంగా ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి మాట్లాడుతూ ప్రపంచ శాంతి నేలకొల్పినందుకు కృషి చేసిన వ్యక్తి, స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేసిన గొప్ప మహనీయుడు, భారతదేశంలో సాఫ్ట్వేర్ రంగానికి పునాదులు వేశారు, అణగారిన బతుకుల్లో వెలుగు నింపి, ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన మహానేత, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చోళ్ళేటి మాధవరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆగపాటి రాజు, ఎస్సిసెల్ అధ్యక్షులు గుండేటి రాజు, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు గుండేటి శ్రీకర్, మండల సీనియర్ నాయకులు పులి సాంబయ్య, మహిళా నాయకురాలు అప్పల కవిత ఆగపాటి రామకృష్ణ, మునుకుంట్ల మోహన్, నల్లతీగల రవి, ఎండీ షేకీల్, చెల్కలపెల్లి అనిరుద్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పవన్ కార్తీక్, ఎండీ ఖాజా పాషా, కుంటపల్లి గ్రామ అధ్యక్షులు పెంతల ప్రతాప్, జన్న యాకయ్య, మెట్టుపల్లి రాజు తదితరులు పాల్గొన్నరు..

## ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వ్యక్తి మృతి మరొకరికి తీవ్ర గాయాలు



**తరంగాలు న్యూస్ తొర్రూర్**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం పత్తేపురం స్టేజి వరంగల్ ఖమ్మం రహదారిపై ద్విచక్ర వాహనం AP 09 CE 6132 వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో 19 సంవత్సరాల కాలేజ్ స్టూడెంట్ దుర్మరణం మరొక 25 సంవత్సరాల వ్యక్తికి తీవ్ర గాయాలు తొర్రూర్ లోని ఆసుపత్రికి తరలింపు. వీరు నరసింహుల పేట మండల వాసులుగా గుర్తింపు బంజర గ్రామపంచాయతీ పత్ని తండావాసులు భానోత్ బిచ్చ ఏకైక కుమారుడు బానోత్ భరత్ ఇంటర్మీడియట్ చదువుతున్న యువకుడు మృతి మరొక వ్యక్తి మృతుడి బావ గుగులోతు రఘు తండ్రి పేరు దేవుజగా గుర్తింపు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది తొరూర్ ఎస్సై (ఎస్హెచ్ఓ) కూచిపూడి జగదీష్ తెలిపారు.

## అలరించిన భజన పాల్గొన్న వనపర్తి భజన కళాకారులు

**తరంగాలు-వనపర్తి**



శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం వనపర్తి జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్తలు వనపర్తికి చెందిన ఉమామహేశ్వర భజన బృందంతో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివపార్వతుల, విఘ్నేశ్వరులపై పలు భక్తిగీతాలను వనపర్తి కి చెందిన ఉమామహేశ్వర భజన మండలి సభ్యులు తెలుగు వెంకట్ రాములు,నగేష్ యాదవ్, వెంకటేష్, హనుమంత్ రెడ్డి, బాల్ రెడ్డి, సత్యమాచారి, వామనాచారి, భాస్కరాచారి, చెన్నయ్య ఆచారి కురుమూర్తి తదితరులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సింగిల్ విండో చైర్మన్ వెంకట్రావు, నరసింహ, చిట్యాల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ వర్ధంతి

### -నివాళి అర్పించిన సిఎం రేవంత్ తదితరులు

**తరంగాలు-హైదరాబాద్**



రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రధానిగా ఐటీ రంగ వృద్ధికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని సోమాజిగూడలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి, వి.హనుమంతరావు, షబ్బీర్ అలీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ గా తీన్మార్ మల్లన్న గెలుపు తథ్యం

**-మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి భూక్యా బాలు నాయక్ ధీమా**



**తరంగాలు/ మహబూబాబాద్**

నల్లగొండ, వరంగల్, ఖమ్మం గ్రాడ్యుయేట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ కు విద్యావంతులు మేధావులు అన్ని వర్గాల గ్రాడ్యుయేట్లు సంపూర్ణమైన మద్దతు తెలుపున్నారని వారికి భారి మెజార్టీతో విజయం ఖాయమైందని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భూక్యా బాలు నాయక్ తెలిపారు వారు మాట్లడుతూ కాంగ్రెస్ మరియు బి.ఆర్.యస్ మధ్యనే ప్రధాన పోటీయని బీజేపీ కి ఈ ఎన్నికల్లో ఆదరణ కరువైందని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టితోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలో మూఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టి అధ్యక్షులు జేన్న రెడ్డి భరత్ చందర్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచందర్ నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ లు తిన్నార్ మల్లనను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు తీవ్రంగా శ్రమిస్తున్నారని వారిని కొనియాడారు కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలో వస్తుందని అని తెలిపి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాబోతున్నారని మహబూబాబాద్ లోని వారి యొక్క క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో తెలిపి ఆశాభావవ్యక్తం చేశారు

## మాజీ ప్రధాని భారత రత్న స్వర్గీయ

# రాజీవ్ గాంధీ వర్ధంతి ఘన నివాళులు





**-శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్**

**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**

మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -బి ఎల్ ఆర్ మరియు డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం రాజీవ్ చౌక్ నందు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ గారు 1986 లో జాతీయ విద్యా విధానాన్ని దేశమంతా విస్తరించే ప్రయత్నం చేస్తూ జవహర్ నవోదయా విద్యాలయాలను స్థాపించిన గొప్ప నాయకులు వారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీని ఎంతగానో ప్రోత్సహించారు. అలాగే సూపర్ కంప్యూటర్స్ రూపకల్పనకు ప్రోత్సాహం అందించిన నాయకత్వం వారిది. వారిని స్మరించు కుంటూ వారి బాటలో ప్రతిఒక్కరం నడుస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్స్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఇంచార్జీలు, ఎన్ యస్ యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు మరియు బిఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

**-తీన్మార్ మల్లన్న బ్యాలెట్ నెంబర్ 2పై మొదటి ప్రాధాన్యత ఓటువేయాలి...**

**-యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్**




**తరంగాలు ప్రతినిధి/ఖానాపూర్**

ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్ట బద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి(చింతపండు నవీన్ కుమార్) తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం బుధరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి సామాన్య ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ వారి సమస్యలను పరిష్కారం చేసేలా మల్లన్న ఎంతో కృషి చేశారు. గత ప్రభుత్వ వ్యతిరేకత విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు వివరిస్తూ వారికి అండగా నిలిచి లాక్డౌన్ సమయంలో తన వంతు సహాయంగా తన టీం తో నిరుపేదలకు అండగా నిలిచి రెండుసార్లు ఓటమి చెందిన చెక్కుచెదరని ధైర్యంతో గత బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ప్రజలకు అండగా నిలిచిన తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఖానాపూర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పల్స ప్రశాంత్ ఎన్ ఎస్ యు ఐ ఖానాపూర్ మండల ఉపాధ్యక్షుడు మహేష్ బుధరావుపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుమొలకలమురళి, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు శంకర్, యూత్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ నజీర్, ఎన్ ఎస్ యు ఐ ఉపాధ్యక్షుడు శివ, యూత్ నాయకులు చాట్ల నాగరాజు, ఉపేందర్, హరీష్, వినోద్, అక్రమ్, కుమార్, ప్రకాష్, వినయ్, తరుణ్, షరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎం ఎం.ఎస్ ఫలితాలలో ప్రతిభ చాటిన కేసముద్రం హై స్కూల్ విద్యార్థులు

**తరంగాలు/కేసముద్రం/**

ఫలితాలలో ప్రతిభ చాటిన కేసముద్రం స్టేషన్ హైస్కూల్ విద్యార్థులు ఈరోజు ప్రకటించిన ఎన్ ఎం ఎం.ఎస్, (నేషనల్ మెన్స్ మెరిట్ కమ్ స్కీమ్ ) ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్ 8వ తరగతి విద్యార్థులు జుజ్జురి ఝాన్సీ మరియు మొహమ్మద్ నఫియా లు సెలెక్ట్ అయ్యారు. వీరికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12000 రూపాయలు స్కాలర్షిప్ లభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కు ఇలాంటి సదుపాయాలు ఉంటాయి రాబోయే తరగతి





విద్యార్థులు ప్రేరణ పొంది చదువుల్లో ముందుకు వెళ్లాలని ప్రధానోపాధ్యాయులు బి రాజు ఈ సందర్బంగా కోరుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కృష్ణవేణి, మధు, యాదగిరి, మదన్మోహన్, శ్రీనివాస్, సదయ్య, సురేష్, చందర్, లక్ష్మి కుమారి, భద్రాసింగ్, శ్రీవిద్య, సత్యనారాయణ, జుబెర్ అలీ లు అభినందనలు తెలిపారు

# సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడం బాధాకరం

**-వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి...**




**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట :** సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడం బాధాకరం అని వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహా స్వామి అన్నారు. వర్ధన్నపేట మండలం ప్రభుత్వ ఆసుపత్రిలో 19వ తారీకు జరిగిన ఘటనపై సూపర్డెంట్ నరసింహస్వామి మంగళవారం మాట్లాడుతూ గర్భిణీ మహిళ కు ఫోన్ లో మాట్లాడుతూ ఆపరేషన్ చేసిందన్న విషయం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటి కాన్పు సుఖ ప్రసవం కాగా రెండవ కాన్పు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించగా నార్మల్ డెలివరీ చేశామని, డెలివరీ అయిన బేబీకి ఆక్సిజన్ లెవెల్ తక్కువగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం న్యూనటల్ అంబులెన్స్ లో ఎంజీఎం కు తరలించామని అన్నారు. ఎంజిఎం ఆసుపత్రిలో శిశువు ఒకరోజు చికిత్స పొందిన తదుపరి మరుసటి రోజున చికిత్స పొందుతూ శిశువు మృతి చెందినట్లు బాధితురాలి బంధువులు తెలిసినట్లు వివరించారు. ఇట్టి విషయమై వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామని అన్నారు. కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాని వేదికగా మార్చుకొని నిజా నిజాలు తెలియకుండా ఆసుపత్రి సిబ్బందిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పోస్టు పెట్టడం భవ్యం కాదని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంగళవారం అసిస్టెంట్ డిఎంహెచ్ వో గోపాలరావు ఆసుపత్రిని సందర్శించి మెరుగైన వైద్య కోసం డాక్టర్లు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు అయన తెలిపారు.

## నాగరాల గ్రామా అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

**-వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**తరంగాలు-వనపర్తి** ముంపు గ్రామమైన నాగరాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాగరాల గ్రామస్తులు హైదరాబాదులోని కార్యాలయంలో ఎమ్మెల్యే తో కలిసి మాట్లాడారు. నాగరాల గ్రామానికి చెందిన సెంటర్లలో మురికి కాలువలు, సిసి రోడ్లు, పాఠశాల భవనాల తో పాటు అన్ని విధాల మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అందుకు సానుకూలంగా స్పందించి నగరాల గ్రామం పై ప్రత్యేక దృష్టి సారించి అన్ని సెంటర్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగాల్లో పురోగమించడం రాజీవ్ చలువే రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**-పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్**




**తరంగాలు -వనపర్తి** దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మేఘా రెడ్డి క్యాంపు కార్యాలయం లో మంగళవారం మాజీ ప్రధాని కీర్తి శేషులు రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్,మున్సిపల్ కౌన్సిలర్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మాట్లాడుతూ దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగమించేందుకు రాజీవ్ గాంధీ కీలక నిర్ణయాలను తీసుకున్నారన్నారు. అతి చిన్న వయసులో ప్రధానమంత్రిగా ఎంపికయి దేశ సేవలో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. నేడు భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఈ స్థాయిలో పురోగమిస్తుంది అంటే దానికి రాజీవ్ గాంధీ సేవలే నిదర్శనం అని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కొనసాగించాలని సూచించారు.

## అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన .

**-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్.**



**తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి /** కొమరారం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వరిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన కానిస్టేబుల్ వీరన్న కుటుంబానికి ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ తన కార్యాలయంలో చెక్కు రూపంలో 4,00,000/- రూపాయల నగదును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.ప్రభుత్వం తరపున మరణించిన పోలీసుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు,సభ్యులు సుధాకర్ కార్యాలయ సూపరింటెండెంట్ సత్యవతి,జూనియర్ అసిస్టెంట్ మధు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెసు, బి అర్ ఎస్ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓట్లు వేయవద్దు

**-బిజెపి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్......**



**తరంగాలు సంగెం** వరంగల్ - ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మద్దతుగా వరంగల్ జిల్లాలోని, పరకాల నియోజకవర్గం, గీసుకొండ మండలం, గ్రేటర్ వరంగల్ 15 వ డివిజన్ మొగిలిచర్ల లో బిజెపి డివిజన్ అధ్యక్షులు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల లో ఉన్న ఎమ్మెల్సీ ఓటర్స్, ప్రైవేట్ టీచర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, డిగ్రీ అయిపోయి ఎమ్మెల్సీ ఓటు ఉన్న అభ్యర్థుల ఇండ్లకు వెల్లి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు ఎందుకు వేయాలో వివరిస్తూ పాంప్లెంట్ ఇస్తూ, డోర్ స్టిక్కర్ వేస్తూ కలవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్ విచ్చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్, అలియాస్ తీన్మార్ మల్లన్నకు ఓటు వేసిన, బిఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి ఓటు వేసిన అవి మురికి కాలువలో వేసినట్టేనని అన్నారు. తీన్మార్ మల్లన్న గెలిసిన, ఏనుగుల రాకేష్ రెడ్డి గెలిచిన డిగ్రీ పట్టబద్రులకు, ప్రైవేటు ఉద్యోగస్తులకు, ఒరిగేది ఏమీ లేదని గంగిరెద్దుల్ల తల ఊపడం తప్ప వీరి వల్ల ప్రయోజనం ఏమి ఉండదని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి గెలిస్తే ప్రైవేట్, ప్రభుత్వ, డిగ్రీ అయిపోయి నిరుద్యోగులుగా ఉన్న వారికి ప్రయోజనం చేకూరుతుందని తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కావున ప్రతి బిజెపి కార్యకర్త, బిజెపి నాయకులు భారతదేశ సరిహద్దు సైనికుల వలె శ్రీ గుజ్జుల పేమేంద్ర రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి పనిచేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, సొసైటీ డైరెక్టర్ లెంకలపల్లి స్వామి, రాచమల్ల వీరస్వామి, రాధారపు మల్లికార్జున్, కునమల్ల రవి తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన

**-జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**




**తరంగాలు /మహబూబాబాద్** జూన్ 4 న నిర్వహించే పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి పట్టణంలోని బస్టాండ్ దగ్గరలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ బాలికల కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఓట్ల లెక్కింపు కి అవసరమైన ఏర్పాటును, చేయాలన్నారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు సంబంధిత ఏర్పాట్లలో బాగంగా గదులు, వసతుల మ్యాపు లను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నిశితంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ, ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ హాళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, వసతి, ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా లేదా అన్నది పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని ప్రత్యామ్నాయంగా జెనరేటర్ సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కౌంటింగ్ టేబుల్స్, కౌంటర్లు, కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి, అభ్యర్థులు,ఏజెంట్ల రాకపోకల కోసం మార్గాలను,సూచికల బోర్డ్ లు పాత్రికేయుల కొరకు మీడియా సెంటర్ ఏర్పాటు ఇతర సదుపాయాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి జిల్లా కలెక్టర్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సీసీ కెమెరాల నిఘాలో నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ద్వారం సీల్, తాళాలను పరిశీలించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు లోకల్ బాడీస్, రెవెన్యూ లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్ మహబూబాబాద్, మహబూబాబాద్ డి.ఎస్.పి తిరుపతిరావు ఆర్డీఓ ఎల్.అలివేలు, డిప్యూటీ సీ.ఈ.ఓ నర్మద, డి.ఏ.ఓ హరిప్రసాద్, సి.ఐ దేవేందర్, ఆర్.ఐ కృష్ణ ప్రసాద్, స్ట్రాంగ్ రూమ్ ఇంచార్జ్ డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

## మండల విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించిన... డిఈవో రామారావు



**తరంగాలు/కేసముద్రం/** మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి పి. రామారావు, మంగళవారం కేసముద్రం మండల విద్యా వనరుల కేంద్రంను సందర్శించి పాఠశాల విద్యార్థుల యొక్క ఏకరూప దుస్తువుల క్లాత్ టైలర్లకు పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కేసముద్రం మరియు ఇనుగుర్తి మండలాలకు సంబంధించిన పంపిణీ వివరాలు మండల ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్ షేక్ ఖాదర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈరోజు వరకు కేసముద్రం మండలం యొక్క మొత్తం 3496 మంది విద్యార్థులకు గాను 2436 మంది విద్యార్థుల, మరియు ఇనుగుర్తి మండలం యొక్క మొత్తం 1498 మంది విద్యార్థులకు గాను 1019 మంది విద్యార్థుల దుస్తువులను టైలర్లకు ఇవ్వడం జరిగింది. తదనంతరం కేసముద్రం స్టేషన్ లోని విద్యార్థుల దుస్తువులను కుట్టే కేంద్రాన్ని పరిశీలించి, తగు సూచనలు, సలహాలు అందించారు. మరియు జూన్ ఐదవ తేదీలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తువులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విత్తనాల సుధాకర్ ఐకెపి సీసీ వెంకటనారాయణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ బిక్షపతి, మెసెంజర్ బిక్షపతి పాల్గొన్నారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI. TELTEL/2022/83463 Tharangalu Daily News Paper

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

-రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపీ...









**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట**

ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపీ అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. గోపీ ధాన్యం కొనుగోలు గురించి రైతులతో నేరుగా మాట్లాడారు. జూన్ మొదటి వారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని, ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ ధాన్యం అమ్మిన రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈప్రక్రియ దాదాపు వందశాతం పూర్తయ్యేలా అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. 14158.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని ,అదేవిధంగా ఖరీఫ్ 2023-24 లో 14992 క్వింటాళ్ల ధాన్యం 275 మంది రైతుల నుండి సేకరించి 3.28 కోట్ల రూపాయలు చెల్లించామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయల్, జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యా రాణి, సహాయ పౌరసరఫరాల అధికారి షా ఫైసల్,

సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించండి

-నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి
-జాబ్ క్యాలెండర్ విడుదలకు సిద్ధం
-పరిశ్రమల్లో స్థానికులకు 80% ఉద్యోగాలు
-ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఐతగోని రాఘవేంద్ర గౌడ్




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**

తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లుగా పట్టిపీడిస్తున్న నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కావాలంటే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని ఐతగోని రాఘవేంద్ర గౌడ్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ... అవకాశవాదంగా ఉద్యోగాల పేరుతో రాజకీయ పార్టీలు నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేస్తే మార్పు తప్పకుండా వస్తుందన్నారు. గత పదహారేళ్లు జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై గళమెత్తుతూ పనిచేస్తున్నానని అన్నారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఉపఎన్నికల్లో 20వ నెంబర్ కు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను గెలిస్తే పరిశ్రమలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలకు కృషి చేస్తానని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, ప్రభుత్వ టీచర్లకు ప్రమోషన్లు, ట్రాన్స్ పర్ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా కృషి చేస్తానని, ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానం, జీవో నెంబర్ 46 రద్దుకు కృషి చేస్తానని, అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇంటి నిర్మాణం, 50 లక్షల ప్రమాద బీమా, నెలసరి జీతానికి కృషి చేస్తానని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, పట్టభద్రులైన నిరుద్యోగులకు కనీస భృతి 10 వేల రూపాయలు ప్రతినెల వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రాకేష్, జయంత్, ఉమేష్, సాయి శివ, డాక్టర్ విద్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

# టాలీవుడ్‌లో రేవ్ పార్టీ కలకలం

-తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు ఆధారాలు
-బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ వెల్లడి
-డ్రగ్స్ నిర్మూలనలో కఠినంగా వ్యవహరిస్తామన్న మంత్రి
-బెంగళూరు రేవ్ పార్టీతో హైదరాబాద్ పోలీసుల అప్రమత్తం
-ఫామ్‌హౌజ్ ఓనర్లకు హెచ్చరికలు జారీచేసిన పోలీసులు



**తరంగాలు బెంగళూరు/హైదరాబాద్,**

రేవ్ పార్టీ టాలీవుడ్‌లో కలకలం సృష్టిస్తోంది. నగర శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ పాల్గొన్నట్లు బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద్ స్పష్టం చేశారు. ఆమె సోమవారం విడుదల చేసిన వీడియో ఎక్కడి నుంచి తీశారో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి పెద్ద మొత్తంలో ఫీజు వసూలు చేశారని.. దాదాపు వంద మంది పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ప్రజా ప్రతినిధులెవరూ పాల్గొనలేదని కమిషనర్ వెల్లడించారు. 'సన్ సెట్ టు సన్ రైస్ విక్టరీ' పేరుతో నిర్వహించిన ఈ పార్టీలో పాల్గొన్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. 'రేవ్‌పార్టీలో కోట్ల రూపాయల విలువైన కొకైన్, గంజాయి స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రాన్ని డ్రగ్స్‌ఫ్రీగా మార్చాలని చేసే ప్రయత్నాలు ఇతర రాష్ట్రాల డ్రగ్స్ పెడ్లర్ల వల్ల విఫలమవుతున్నాయి. ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తాం' అని తెలిపారు. బెంగుళూరు శివారులో ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ పార్టీలో తాను లేనని తెలుపుతూ హేమ ఓ వీడియో విడుదల చేశారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని.. తనపై వస్తోన్న వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. అయితే రేవ్ పార్టీలో పోలీసులు సంపాదించిన ఫోటోలోని డ్రెస్, వీడియోలని డ్రెస్ ఒకటే కావడంతో అనుమానాలు బలపడ్డాయి. ఇదిలావుంటే బెంగళూరు శివారులో రేవ్ పార్టీ ఉదంతం హైదరాబాద్‌లో ప్రకంపనలు రేపుతోంది. నగర శివార్లలోని ఫాంహౌస్‌లలో తరచూ డ్రగ్స్ పట్టుబడడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. రేవ్ పార్టీలు, అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా నిఘా ఉంచారు. ఫాంహౌస్‌ల యజమానులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో సినీ పరిశ్రమ సహా వివిధ రంగాల ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి.

# మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

-కాంగ్రెస్ నేత మాజీ సర్పంచి పరికపల్లి శ్రీనివాస్



**తరంగాలు /వైరా టౌన్ /**

ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయమని ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజక వర్గంలోని పట్టభద్రులందరూ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించండి




**తరంగాలు ప్రతినిధి/జనగామ**

ఉమ్మడివరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా, స్టేషన్ ఘనపూర్ ఇన్చార్జ్ డాక్టర్ తాటికొండ రాజన్న ఆదేశానుసారం జఫర్గడ్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పల్లెపాటి జయపాల్ రెడ్డి ,మండల ఇంఛార్జి పెంతల రాజ్ కుమార్, తాటికాయల వరుణ్,యార సోమిరెడ్డి ఆధ్వర్యంలో భూత్ కమిటీల సభ్యులు, మండలంలోని పలు గ్రామాలు,జాఫర్ ఘడ్ తమ్మడపల్లిజి, ఓబులాపూర్ , ముగ్దుమ్ తండా, శపల్లి,సురారం,హిమ్మత్నగర్,తి మ్మాపూర్,తిగారం,తిమ్మంపెట్, లో బి ఆర్ఎస్ ముఖ్య నాయకులు,పట్టభద్రుల సమక్షంలో ప్రతి 25 మంది పట్టభద్రులకు ఒక ఇన్చార్జిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో మరపెల్లి కరుణాకర్, ఇల్లందుల రాజు, మేడిపేలి శ్రీనివాస్, మాచర్ల సోమయ్య, మెరుగు రమేష్, ముసుకు తిరుమల్, కుశ శ్రీను, మాచర్ల శ్రీను, గోనె సంపత్, మంద రాజయ్య, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, పట్టభద్రులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెలాఖరు లోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి.

-జిల్లా ప్రత్యేక అధికారి సురేందర్ మోహన్ ఐఏఎస్.



**తరంగాలు భద్రాద్రి /ప్రతినిధి /**

మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక అల జిల్లాలో 136 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, 1,33 000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, జిల్లాలో ఇప్పటివరకు 1,24,000 క్వింటాల ధాన్యమును 2081 రైతుల వద్ద నుండి కొనుగోలు చేశామని దీనికిగాను 24 కోట్లు రైతులకు జమ చేశామని జిల్లా ప్రత్యేక అధికారి కు వివరించారు. లిఈ సందర్భంగా సురేంద్రమోహన్ ఐఏఎస్ మాట్లాడుతూ ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం లో తేమ శాతం ఉన్నప్పటికీ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం డెలివరీ కి సంబంధించి నా వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్డిఓ విద్యాచందన, జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఆర్టీవో కిషన్ రావు, తూనికలు కొలతలు శాఖ అధికారి మనోహర్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్, డీఎం సివిల్ సప్లై త్రినాథ్ బాబు, మరియు జీసీసీ డివిజనల్ మేనేజర్ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# సంస్కరణల సృష్టికర్త రాజీవ్ గాంధీ..



తరంగాలు-రాయపర్తి
టెలీకమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు.. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనుడు.. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని మంగళవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కంప్యూటర్ రంగాన్ని దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేసింది మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామాల అభివృద్ధికి రాజీవ్ ఎంతగానో కృషి చేశారు అని వివరించారు. ఐటీ రంగంలో ఈనాడు దేశం అగ్రగామిగా ఉందంటే అది రాజీవ్ సంకల్ప ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఆలయ చైర్మన్ రామకృష్ణ చార్యులు, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, సుదర్శన్ రెడ్డి, నర్సయ్య, యాకుబ్, కుమారస్వామి, ఆఫ్రోస్, శ్రీనివాస్, వెంకట్, రవి తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల భూమికి హద్దులు వేయాలి: రాజ్ కుమార్ యాదవ్

**- తహశీల్దార్ కు వినపత్రం అందజేత కాంగ్రెస్ నాయకుడు**



తరంగాలు- మల్హర్ రావు
కాటారం మండలంలోని గెగులగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోకన్వీనర్ మొగిలి రాజ్ కుమార్ యాదవ్ మంగళవారం మండల తహశీల్దార్ నాగరాజుకు వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రేగుల గూడెం రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 201 లోని 0-18 గుంటల భూమి బూడిద పల్లి ప్రాథమిక పాఠశాలకు కేటాయించడం జరిగిందని, అట్టి భూమి అన్యాక్రాంతానికి గురైయ్యే అవకాశం ఉంది కాబట్టి రెవెన్యూ సర్వేయర్, సిబ్బందితో హద్దులు వేసి ప్రభుత్వ పాఠశాల భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేసినట్లుగా తెలిపారు.

## ధైర్య పడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది: మహేందర్ యాదవ్



తరంగాలు- మల్హర్ రావు
అధైర్య పడవద్దు ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర ఐటి,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సహచరుడు మహేందర్ యాదవ్, భూపాలపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల రాహుల్ అన్నారు. మండలంలోని చిన్నతూ డ్ల గ్రామానికి చెందిన యూత్ కాగ్రెస్ నాయకుడు సుదమల్ల వెంకటేష్ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి దుద్దిళ్ల ఆదేశాల మేరకు మహేందర్ యాదవ్, రాహుల్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సూపర్ డెంట్ ను అడిగి తెలుసుకున్నారు.వెంకటేష్ ఆపరేషన్ కు బ్లడ్ అవసరం ఉండగా రాహుల్ దోనెట్ చేశారు. అధైర్య పడవద్దు కాంగ్రెస్ పార్టీ అన్నివిధాల అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాము, వెంకటేష్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## ఘనంగా దివంగత నేత రాజీవ్ గాంధీ వర్ధంతి



తరంగాలు-గోవిందరావుపేట
మండల కేంద్రంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ లు తమ ప్రాణాలను చివరి రక్తం బొట్టు వరకు దేశం కోసం త్యాగం చేయడం జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలు వెల కట్టలేనివీ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫామ్ ఆయిల్ రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి: పుల్లయ్య




తరంగాలు-అశ్వారావుపేట
ఆయిల్ ఫాం సాగు దారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేసారు. ఏఐకేఎస్ రాష్ట్ర విస్తృత సమావేశం మంగళవారం హైద్రాబాద్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భం ఆయన ఆయిల్ ఫాం సాగు దారులు ఎదుర్కొంటున్న సమస్యలు పై సమావేశంలో మాట్లాడారు. ఆయిల్ ఫాం సాగు లో పెరిగిన వ్యయం దృష్ట్యా టన్ను గెలలు కు రూ.20 వేలు ఇవ్వాలి అని,నాణ్యమైన మొక్కలు ఇవ్వాలని,ఏళ్ళ తరబడి బకాయి పడ్డ రాయితీలను వెంటనే చెల్లించాలని,పోడు, ఫారెస్ట్, ధరణి బాదితుల కు మొక్కలు,డ్రిప్ ,రాయితీలు ఇవ్వాలని సమావేశంలో తీర్మాణం చేసారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సుదర్శన్ రావు, సాగర్ లు పాల్గొన్నారు.

# బోల్తా పడిన ధాన్యం బస్తాల లారీ




తరంగాలు-రాయికల్
రాయికల్ మైతాపూర్ రోడ్ డ్యాం వంతెన వద్ద మంగళవారం రోడ్డు మళ్ళింపు దారి గుండా వెలుతున్న ధాన్యం బస్తాల లారీ అదుపుతప్పి బోల్తా పడింది.పట్టణంలోని శివాజీ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి టి.ఎస్.యు.బి 1534 నెంబర్ గల లారి సుమారు 650 వరి ధాన్యం బస్తాలు లోడ్ చేసుకుని జోగిని పల్లి గ్రామంలోని ఎస్.ఆర్.ఆర్ రైస్ మిల్లు కు తరలించే క్రమంలో డైవర్షన్ రోడ్డుపై బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.వంతెన నిర్మాణం పనులు నత్త నడకన కొనసాగుతున్నాయని, డైవర్షన్ రోడ్డు పూర్తిగా గుంతల మయమై ఉండడంతో పాటు సరియగు మట్టిని నింపకపోవడంతో లోడుతో ఉన్న లారి ఓవైపు మట్టిలో దిగబడి బోల్తా పడిందని, కనీసం హెచ్చరిక సైన్ బోర్డులు లేకపోవడం బాధాకరమని, వంతెన నిర్మాణం పనులు నడుస్తున్నప్పుడు వాహనాలు పోవడానికి సరైన మట్టి రోడ్డు నిర్మాణం చెయ్యలేదని,అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్షం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, వి.మహేష్ గౌడ్ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు,కాంట్రాక్టర్ గుంతలు లేని డైవర్షన్ మట్టి రోడ్డును సరిచేయించి, వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని వారు కోరారు. ఈ విషయంపై ఆర్ అండ్ బి ఏ.ఈ మధును వివరణ కోరగా ఓవర్ లోడ్, డ్రైవర్ తప్పిదం వల్లనే ప్రమాదం జరిగిందని, బస్సు రావడం వల్ల డ్రైవర్ లారీని పక్క నుండి తీసేందుకు ప్రయత్నించగా ప్రమాదం సంభవించిందని,తాత్కాలిక డైవర్షన్ రోడ్లకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకించిన నిధులు రావని త్వరలోనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. సంవత్సర కాలంగా వంతెన నిర్మాణ పనులు పూర్తికాక పోవడంపై సంబంధిత కాంట్రాక్టర్ వెంకట రమణరావును వివరణ కోరగా ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి బిల్లులు రాకపోయినా పనులు చేపిస్తున్నామని, గతంలో వర్షాలు,నీటి ప్రవాహం వల్ల పనులు ముందుకు సాగలేదని, ప్రస్తుతం వంతెన పై అడ్డంగా ఉన్న ఎలక్ట్రికల్ వైర్లను తొలగించేందుకు సంబంధిత అధికారులకు నిబంధనల ప్రకారం రుసుము కూడా చెల్లించామని,ఎలక్ట్రికల్ వైర్లను తొలగించిన వెంటనే వంతెన పై నుండి వాహనాలు వెళ్లే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.కాగా ఈ ప్రమాదంలో డ్రైవర్ కు ఏలాంటి గాయాలు కాలేదు.

## వేములవాడలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు..

**-రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు..**



తరంగాలు-వేములవాడ
రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు, రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి నీ వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశానికి రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ కుమారుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు చిలుక రమేష్, పీర్ మహమ్మద్, దాడి మల్లేశం, కొలకని రాజు, పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్, అక్క న పెల్లి నరేష్, నాగుల మహేష్, దుర్గం పరశురాం గౌడ్, అరుణ్ తేజ చారీ, వస్తాదు కృష్ణ ప్రసాద్ గౌడ్, కొక్కుల బాలకృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి నాగరాజు, సాబీర్, రాజు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో రాజీవ్ గాంధీ వర్ధంతి



తరంగాలు-శంకరపట్నం
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపగాని బసవయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ వర్ధంతికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, గాజుల శ్రీనివాస్,హిస్సమోద్దీన్, మొలంగూరి సదానందం,జంపయ్య,బండారి తిరుపతి,నేరెళ్ల సంతోష్,ఆరిఫ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ముందు ఛలో బస్ భవన్ కార్యక్రమం



తరంగాలు-ఆర్మూర్
రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో బస్ భవన్ కార్యక్రమం మంగళవారం టి ఎస్ ఆర్ టి స డిపో యందు నిర్వహించినారు. ..డిపో అధ్యక్ష కార్యదర్శులు రవి చందర్ రమేష్ రాష్ట్ర కార్యదర్శి గోపి అధ్యక్ష కార్యదర్శిలు రవి చందర్ రమేష్ లు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియని వెంటనే పూర్తి చేయాలి మరియు చట్టపకారం టీఎస్ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుదించాలి ,2013 ఆర్పీఎస్ బాండ్ డబ్బులను వెంటనే అందరికీ చెల్లించాలి అని, ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలీ అని ,అన్ని ఖాళీలను భర్తీ చేయాలి పని భారాలను తగ్గించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి గంగవ్వ సుజాత సుమలత జ్యోతి లతా భూమన్న శీను హరి రవీందర్ గంగాధర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



తరంగాలు-కమ్మర్ పల్లి
మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు శివ పంతులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణనాల మధ్య కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# రాజు గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయా: తండేల్‌పై నాగచైతన్య

పాకిస్థాన్ ప్రాదేశిక జలాల వెంబడి పట్టుబడి రెండేండ్లపాటు జైలు శిక్షను అనుభవించి భారత్‌కు తిరిగొచ్చిన రాజు అనే వ్యక్తి నిజజీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ పాత్ర కోసం నేను తొమ్మిది నెలలు ప్రిపేర్ అయ్యా. రాజు ఇంటికెళ్లా.. అతడి ధైర్యసాహసాలు, సంకల్పం గురించి తెలుసుకొని ఆశ్యర్యపోయా. మత్స్యకారుల ఇబ్బందులు తెలుసుకునేందుకు వారితో కొంత సమయం గడిపాను. తండేల్ నా కెరీర్‌లోనే అతిపెద్ద సినిమా.. ఆ పాత్ర నాకు కావాలి.. అలాంటి స్ఫూర్తిదాయకమైన కథ ఇది. నేను శ్రీకాకుళం యాసతోపాటు ప్రతిదీ సరిగ్గా ఉండేలా చూసుకోవాలనుకుంటున్నా..అంటూ చెప్పుకొచ్చాడు. తండేల్ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. తండేల్ 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. టాప్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇటీవలే చైతూ, సందీప్ వేద్, జబర్దస్త్ మహేశ్, చందూ మొండేటి అండ్ టీం షూటింగ్ లొకేషన్‌లో తీసిన వర్కింగ్ స్టిల్ ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. మరోవైపు సాయిపల్లవి పోషిస్తున్న సత్య పాత్ర ఇంట్రడక్షన్ వీడియో ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది. తండేల్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ దక్కించుకోగా.. తండేలా స్ట్రీమింగ్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లకు సొంతం చేసుకుందని సమాచారం.



# ఆ హీరోతో కీర్తిసురేష్ లిప్ లాక్.. సినిమాకు అదే హైలైట్

టాలీవుడ్ లో కీర్తిసురేష్ కు మంచి క్రేజ్ ఉంది. ఆమె తన నటనతో ప్రేక్షకులకు దగ్గరయింది. తమిళ్ ఇండస్ట్రీ నుంచి వచ్చిన కీర్తికి మనదగ్గర మంచి క్రేజ్ ఉంది. తెలుగులో నేను శైలజ సినిమాతో పరిచయమైన ఈ చిన్నది ఆతర్వాత తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ రేంజ్ కు ఎదిగింది. సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన మహానటి సినిమా కీర్తి రేంజ్ ను అమాంతం పెంచేసింది. అలనాటి మహానటి సావిత్రి పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది కీర్తిసురేష్. ఆతర్వాత ఈ చిన్నది యంగ్ హీరోలతో జోడీ కట్టింది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో అజ్ఞాతవాసి, మహేష్ బాబుతో సర్కారు వారి పాట సినిమాల్లో నటించి మెప్పించింది. ఇదిలా ఉంటే ఈ మధ్య కీర్తిసురేష్ గ్లామరస్ పాత్రల్లో మెరుస్తూ అభిమానులకు షాక్ ఇస్తుంది. మొన్నామధ్య వచ్చిన మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాలో కాస్త గ్లామర్ గా కనిపించి కవ్వించింది కీర్తి. అలాగే సోషల్ మీడియాలోనూ ఈ అమ్మడు తన అందచందాలతో కనువిందు చేస్తుంది. కాగా తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటున్న కీర్తిసురేష్ ఇప్పుడు బాలీవుడ్ వైపు అడుగులేస్తోంది. ఇప్పటికే అక్కడ వరుణ్ ధావన్ తో కలిసిబేబీజాన్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ అట్లీ నిర్మిస్తున్నారు. ఇక బాలీవుడ్ సినిమాల్లోలిప్ లాక్ అనేది చాలా కామన్ అన్న విషయం తెలిసిందే. అలాగే ఇప్పుడు బేబి జాన్ సినిమాలోనూ లిప్ లాక్ సన్నివేశం ఉందట. ఈ మేరకు దర్శకుడు కీర్తిసురేష్ కు సన్నివేశాన్ని ఆ సన్నివేశంలో లిప్ లాక్ ప్రాధాన్యతను వివరించాడట. అయితే సినిమా కథను వివరించే ముందే.. దర్శక నిర్మాతలు కీర్తికి కండీషన్ పెట్టారట. లిప్ లాక్ కంపల్సరీ అని చెప్పారట. దాంతో బాలీవుడ్ లో రాణించాలంటే తప్పదు అని భావించిన కీర్తిసురేష్ ఆ కండీషన్ కు ఓకే చెప్పిందట. ఇన్ని రోజులు పరిమితులు దాటని పాత్రల్లో మెప్పిన కీర్తి ఇప్పుడు గ్లామర్ రోల్స్ తో పాటు లిప్ లాక్స్ తోనూ అభిమానులకు కిక్ ఇస్తుందని తెలుస్తోంది. దాంతో కీర్తిఫ్యాన్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. వరుణ్ ధావన్ ను పెట్టిపుట్టావ్ బ్రో అని అంటున్నారు. మరి ఈ సినిమా కీర్తి బాలీవుడ్ కెరీర్ కు ఎంత హెల్ప్ అవుతుందో చూడాలి. అలాగే ప్రభాస్ హీరోగా నటిస్తున్న కల్కి సినిమాలో ఓ రోబోట్ కు కీర్తి వాయిస్ ఇచ్చింది. ఇటీవలే ఆ రోబో ను పరిచయం చేశారు మేకర్స్.



# కేన్స్ చిత్రోత్సవం.. ఓ మరువలేని అనుభూతి

## నటి కియారా అద్వానీ వెల్లడి

రి'కేన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొనడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తానని బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ అన్నారు. తనదైన నటనతో మెప్పించే ఈ భామ.. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఉమెన్ ఇన్ సినిమా' అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వేడుకలోని తన అనుభవాలు, రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తిర విషయాలను కియార పంచుకుంది. కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవ్వడం సంతోషంగా ఉంది. నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ఎంతో మధురమైన జ్ఞాపకంగా ఉండిపోతుంది. దాదాపు 20ఏళ్ల క్రితం నా కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యాను. చిన్నప్పుడు దీని గురించి ఇంటర్నెట్ ద్వారా తెలుసుకునేదాన్ని. కానీ.. నేను ఒక సెలబ్రెటీగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేడుకలో పాల్గొంటానని ఆ సమయంలో నాకు తెలీదు. కేన్స్ చిత్రోత్సవం నాకు ఎప్పటికీ మర్చిపోలేని ఒక అనుభవం' అంటూ ఆనందం వ్యక్తం చేసింది. యాక్షన్ చిత్రాల్లో నటించడానికి చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. 'వార్ 2', 'డాన్ 3'లతో ఆ కోరిక నెరవేరబోతుంది. ఇవి నా కెరీర్‌లోనే పెద్ద ప్రాజెక్టులు. ప్రేమకథలు, కామెడీ..ఇలా అన్ని జానర్లలో పనిచేశాను. కానీ చాలా కాలంగా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రాల్లో నటించడం కోసం వేచి చూస్తున్నాను. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఒకానొక సమయంలో 'షేర్షా' సినిమాలో నేను భాగమైనప్పుడు.. 'ఓ మై గాడ్ ఇదొక యుద్ధానికి సంబంధించిన యాక్షన్ చిత్రం. ఇలాంటి ప్రాజెక్టులో ఈమె నటిస్తుందా..?' అని కొంతమంది నా మీద విమర్శలు చేశారు. కానీ.. ప్రస్తుతం భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న రెండు పెద్ద ప్రాజెక్టులు నా చేతుల్లో ఉన్నాయి. ఈ సినిమాల్లో నన్ను నేను నిరూపించుకోవడమే ముఖ్యం అని తెలిపింది.



# గం.. గం.. గణెశా'తో వస్తోన్న ఆనంద్ దేవరకొండ

## 31న విడుదల కానున్న చిత్రం




'గం.. గం.. గణెశా'తో ఆనంద్ దేవరకొండ థియేటర్లలో సందడి చేయనున్నారు . ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ఉదయ్ శెట్టి తెరకెక్కించారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి సంయుక్తంగా నిర్మించారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 'దర్శకుడు ఉదయ్ నా దగ్గర పని చేశాడు. అంకిత భావం, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి. ఈ సినిమా తప్పకుండా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. బేబి' ట్రైలర్ జులైలో విడుదల చేశాం. అప్పుడు వర్షం పడింది. ఇప్పుడు మేలో ఈ ట్రైలర్ విడుదల చేశాం. ఇప్పుడూ వర్షం పడింది. 'బేబి'లాగే ఈ సినిమాతోనూ ఆనంద్‌కు విజయం దక్కాలని కోరుకుంటున్నా' అన్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. 'తొలిసారి ఈ సినిమాలో ఓ హుషారైన విభిన్నమైన పాత్ర పోషించా. భయం, అత్యాస, కుట్ర అనే అంశాల్ని కేంద్రంగా చేసుకుని అల్లుకున్న క్రైమ్ కామెడీ ఇది. చిత్రసీమలో ఎవరైనా ఏదైనా సాధిస్తే కొన్ని గ్రూప్స్ మాత్రమే సెలబ్రేట్ చేస్తున్నాయి. అది సరికాదు. మనమంతా మన ఇండస్ట్రీ వాళ్లు సాధించే విజయాల్ని వేడుక చేసుకోవాలి' అన్నారు. 'వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం. వినోదాత్మకంగా ఉంటూనే ట్విస్ట్‌లు థ్రిల్ పంచుతాయి' అన్నారు దర్శకుడు ఉదయ్. కార్యక్రమంలో సాయి రాజేశ్, సారిక, కేదార్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తికేయ భజే వాయు వేగం ట్రైలర్ ఎప్పుడంటే..?



ఆర్ఎక్స్ 100 ఫేం కార్తికేయ లీడ్ రోల్‌లో నటిస్తోన్న లేటెస్ట్ ప్రాజెక్ట్ భజే వాయు వేగం . డెబ్యూ డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. కార్తికేయ 8 గా వస్తోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే కార్తికేయ బ్యాట్ పెట్టుకొని తన అదృష్టాన్ని ఛేజ్ చేస్తూ.. పరుగులు పెడుతున్న స్టిల్ నెట్టింట ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని మే 31న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు తెలియజేశారు మేకర్స్. ట్రైలర్ లాంఛ్ ప్రకటన త్వరలోనే అంటూ షేర్ చేసిన నయా లుక్‌లో వికెట్ల మధ్యలో బంతి కనబడుతుంటే.. కార్తికేయ పరుగెత్తుకుంటూ రావడం చూడొచ్చు. ఈ లుక్ నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. కాగా ఇప్పటికే షేర్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. భజే వాయు వేగం యూఎస్‌లో మే 30న ప్రీమియర్ కానుంది. ఈ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌ను ఓవర్సీస్‌లో శ్లోక ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తోంది. ఈ చిత్రంలో మలయాళ భామ ఐశ్వర్యమీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. హ్యాపీ డేస్ ఫేం రాహుల్ టైసన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన సెట్ అయ్యిందే పాటకు మంచిస్పందన వస్తోంది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**